కథానిక

# మహాసంకల్పం

పన్యాల రంగనాథరావు

కొంత మంది కేవలం డబ్బు చేయటానికే పుట్టుకొస్తారు. మరికొంతమంది వారి పూర్వీకులు చెమటోడ్చి కూడబెట్టిన డబ్బు కాస్తా ఖర్చు చెయ్యటానికే పుట్టుకొస్తారు. ఈ రెండు రకాల వారికీ డబ్బు ఆడుతూనే ఉంటుంది. పోతే నావంటివాడికి డబ్బు చెయ్యటమూ చేతకాదు. చేతిలో ఒక అయిదు రూపాయల కాగితమే ఉంటే, దాన్ని ఆనందంగా ఖర్చు చెయ్యటమూ చేతకాదు. ఈ మూడు అవస్థా భేదాలూ ఆధారం చేసుకొని, ఆర్థిక శాస్త్రంలో ఎన్ని అధ్యాయాలైనా నింపవచ్చు.

దుర్యోధనానికి డబ్బు ఖర్చు చెయ్యటం చేతవయ్యేదీ కానిదీ మన కనవసరం. ఉన్న డబ్బు ఖర్చు చేయగలటం కూడా పెద్ద కళ. ఆ కళ వాడికి ఉన్నదీ లేనిదీ మరొకప్పుడు ముచ్చటిద్దాం. చెప్పొచ్చేదేమిటంటే, డబ్బు చేయటానికే దుర్యోధనం పుట్టాడు. వాడి చేతిలో అవసరానికి దమ్మిడీ కూడా ఉండక పోవటం నేనెరుగుదును. అయితే, వాడీపాటికి సులభంగా కొన్ని లక్షలు ఖర్చుపెట్టి ఉండటం కళ్లారా చూశాను.

డబ్బు చేయటానికి, వాడికి కనిపించే అవకాశాలు నాకు కనిపించవు. నావంటివాడు దుర్వినియోగ పరిచే అవకాశాలే వాడు పూర్తిగా వినియోగించుకొని, నోట్ల కట్టలు పరిచి పడుకొనేవాడు.

దుర్యోధనం నేనూ కలిసి చదువుకొంటున్న రోజులలోనే, వాడిలో ఈ గుణం కనిపెట్టాను. ఈనాడు అనేకమంది పెద్దలు బాహాటంగానూ ధారాళంగానూ సాగిస్తున్న ఘరానా దోపిడీ, వాడు చదువుకుంటూనే సాగించేవాడు. వాడంటే అనేకమందికి అసూయ పుట్టుకు రావటానికి, వాడి అదృష్టం కూడా అలాగే కలిసి వచ్చేది. చదువుకొంటున్న రోజులలోనే వాడు ఏదో పజిలుకి కట్టి మొదటి బహుమానం ఎవడితోనో పంచుకున్నాడు. అయిదువేల రూపాయలు వచ్చి పడ్డాయి. వాటిని అయిదు రోజుల్లోనే వాడు ఊడదియ్యటం వేరే కథ.

యుద్ధపు రోజులలో వాడే పెద్దమనిషికీ తీసిపోలేదు. చూస్తూ చూస్తూ ఉండగానే వేలకు వేలమీద చేతులు తిప్పేసేవాడు. వాడి వ్యవహారం చూస్తూ ఆశ్చర్యపోతూ కూడా, వాడి బస్సు ఖర్చులు నేనే భరించేవాణ్ణి!

అయితే, ఇటీవల దుర్యోధనం ఆర్థికస్థితిలో కొంత మాంద్యం ఏర్పడింది. ఎటువంటి వాళ్లకేనా కొన్నికొన్ని రోజులు మరీ హీనంగా గడవటం పరిపాటి. వాడికి కొంచెం అప్పు కూడా పెరిగింది. అయితే వాడు, ఈ అప్పు తీర్చటం గురించి గాని, రోజులు గడవటం గురించి గాని ఎన్నడూ ఎటువంటి ఆలోచన చేయక, నిశ్చింతగా ఉండేవాడు.

"ఈ వెధవ అప్పులన్నీ తీరిపోయి, కాలు మీద కాలు వేసుకొని, దర్జాగా బతికేరోజులు మళ్ళా వచ్చి తీరతాయి. చూస్తూ ఉండు" అనేవాడు నాతో.

వచ్చినా కూడానూ. దుర్యోధనం తెల్లవారకుండానే, ఒకనాడు పరుగెత్తుకొచ్చి, "వొరే! నేను కూడా నిలబడాలని నిశ్చయించేశాను" అన్నాడు.

"ఎక్కడా?" అన్నాను ఇంకా నాటి నిద్రమత్తు తీరక.

"ఎక్కడేమిటి? ఇక్కడే! ఎలెక్షన్లకి!" అన్నాడు. నాకంతా అర్థమయింది.

"దేనికి నిలబడ్తున్నా" వన్నాను.

"రెండింటికీని! పోయిందేముంది? గుడ్డివాడి దెబ్బ!" అన్నాడు దుర్యోధనం.

"అంటే?"

"నీకేం తెలీదల్లే ఉంది. ఇటు శాసనసభకీ, అటు పార్లమెంటుకీ కూడానూ. మనవంటి వాళ్ళ క్షేమమంతా విచారించే, మన పెద్దలు చక్కని రాజ్యాంగం అంటూ ఏర్పాటు చేశారు!"

"నీకింతకీ టిక్కెట్టెవరిచ్చారూ?" అన్నాను నాకు కొత్త పొద్దున్నే మతి చలిస్తున్నదేమో అనే అనుమానంతోనే!

"నాకొకరిచ్చేదేమిటి? స్వతంత్రుణ్ణి! మన రాజ్యాంగంలో వ్యక్తి స్వాతంత్ర్యం గురించి చదవలేదుట్రా మరి? మరో రెండు నెలలు చాలు. ఢిల్లీ మనం కుబేరస్థానం..."

వాడి మతే చలించిందని రూఢి అయింది.

దుర్యోధనం, కేవలం స్వార్థపరుడై, ప్రజల డబ్బు గుంజి సుఖిద్దామనే దురుద్దేశంతోనే ఈ దీర్ఘకాల ప్రణాళిక వేశాడని నేను చింతించలేదు. ఇతరులకీ, దుర్యోధనానికీ ఉన్న తేడా యేమిటంటే, మా వాడి మహాసంకల్పం కుండ పగలేసినట్టుగా ఉండటమే. ఇంత సూటిగా, ఒకే ముక్కలో వాడి ఎన్నికల మహాసంకల్పం అంతా ఇమిడి ఉండటం, అన్నివిధాలా ప్రశంసనీయం.

"మన నియోజక వర్గంలో అప్పుడే కాంగ్రెస్ టిక్కెట్టు ఎవరికో ఇచ్చేశారు. అటు కె. యం. పి. ఇటు కృషికార్ లోక్ పార్టీ, కమ్యూనిస్టులూ, సోషలిస్టులూ కూడా తలా ఒక్కొక్క మనిషినే నిలబెట్టేస్తున్నారు. నీవంటి స్వతంత్రులు కూడా నలుగురైదుగురు చేరటం చూస్తున్నాం. నువు కూడా దిగితే మట్టి కొట్టుకుపోతావు జాగ్రత్త!" అంటూ హెచ్చరించాను దుర్యోధనాన్ని.

"మొదట్నుంచీ నా విడుపే అదీ! నీలో పిసరంతైనా అడ్వెంచరస్ స్పిరిట్ లేనే లేదు. వచ్చే అవకాశం జారవిడుస్తావు నువ్వు. నాలుగ్గోడలమధ్య కూర్చుని డబ్బు డబ్బంటే ఎక్కడ నుంచి ఊడిపడ్తుందనుకుంటున్నావు? నన్నిప్పుడు నిరుత్సాహ పరచడం కాస్తా విరమించి, నువు నాకివ్వగల ఉత్సాహమంతా ఇస్తావా, చస్తావా?" అన్నాడు దుర్యోధనం.

వీడితో వాదించి నేనెన్నడూ గెలిచిన పాపాన పోలేదు. ఆ గెలవటమేదో డబ్బుతో సహా వాడే గెలుస్తాడు. మేం చాలాసేపు తర్కించుకున్నాం. నువ్వెంత అంటే, నువ్వెంత అనుకున్నాం. అన్నీ కట్టిపెట్టి, అసలు విషయానికి వచ్చాం.

దుర్యోధనం తలపెట్టే ఏపని అయినా సరే, ఫలించి తీరుతుందనే నమ్మకం వాడు నాలోనే కాక, నావంటి అభాజనులకు చాలామందికి కలిగించి ఉన్నాడు. అందులో ఆ సేటులు పెద్ద వర్తకులైనారు. దుర్యోధనం సేల్సు మేనేజరుగా పని చేస్తున్న మిల్లు యజమాని హీరాలాలు వంటివాళ్ళనికూడా ఇట్లానే ఏనాడో బుట్టలో వేశాడు. అటువంటి వ్యాపారస్థులందరికీ తన మీద ఉండే విశ్వాసం, మరింత ఎక్కువ చేసుకోడానికి ఏ అవకాశం వచ్చినా సరే జారవిడవకుండా, సద్వినియోగపరుచుకుంటూ, వాళ్ళందరికీ దేవుడై కూర్చున్నాడు దుర్యోధనం. ఇంత దన్ను ఉండికూడా, అవసరం వచ్చినప్పుడు వాడిచేతిలో ఎర్రని ఏగానీ అయినా ఆడకపోవటంలోనే ఉంది చిత్రం!

దుర్యోధనం, వ్యాపారస్థులైన తన స్నేహబృందం ఆదరణ మరింత ఎక్కువ చేసుకోడానికి, "ఆదాయపు పన్ను ఎగవేత" వాటి పాలిటికి బాగా పనికొచ్చింది. ఏ వ్యాపారస్థుడు, ఎంతెంత పన్ను ఎగవేశాడో దుర్యోధనానికి బాగా తెలుసు. ఎక్కడా కేసులనేవి రాకుండా చక్రం అడ్డువేశాడు దుర్యోధనం. ఈ ఎన్నికలలో వాడు తప్పిదారి గెలిస్తే, ఆర్థిక మంత్రి కావలసినంతవాడు! వాడు చేసిన ఉపకారానికి వాడి స్నేహితులంతా ఎంతైనా కృతజ్ఞత చూపిస్తూ ఉండడంకద్దు.

"నిన్ను నేను ఏ విధంగా ప్రోత్సహించాలో చెప్తే ప్రోత్సహిస్తాను" అన్నాను.

"ముందు నీ వోటూ, నీ పెళ్ళాం వోటూ, నీ తమ్ముడు—వాడికి వోటుంది కదూ? ఇంకా మీ అమ్మ వోటు, మీ నాన్న వోటు, అన్నీ నా పరం వేయాలి. ఈ యింట్లో నిక్కచ్చిగా అయిదు వోట్లు నాకున్నాయని చెప్పాలి."

"నువ్వే నిలబడితే, మా అందరి వోట్లు

"నీకొక్కడుంటే, ఇక్కల కిస్తామా యేమిటి?" అన్నాను.

"అక్కడికదొకటి సెటిలైంది. ఆ తర్వాత, నువ్వు నా ఎలెక్షన్ ఏజెంటువి" అన్నాడు దుర్యోధనం.

"నీకు పుణ్యముంటుంది. నన్నుమాత్రం ఈ రచ్చలోకీడ్చకు. నాకు వవ్యధీ లేదు. నేనటువంటి పని చేయనూలేను." అని సూటిగా చెప్పేశాను.

"నిన్ను సరికేస్తాను. ఆ తరువాత నీ పెళ్లాం నామీదపడి ఏడ్చి లాభంలేదు."

"సరికేయి."

"నా మాట విను. నీవు ఈ పని కాస్త చేస్తివా, నీకేదో ఋణమో పణమో ముట్టచెప్పక పోను. నేనేమంత కృతఘ్నుణ్ణి అనుకోకు."

పార్లమెంటు సీటుకూ, శాసనసభ సీటుకూ కూడా దుర్యోధనం నామినేషన్లు పెట్టడం, అవి ఆమోదం పొందటం, వాడు చూస్తూవుండగానే డిపాజిట్లు కట్టివెయ్యడం, అన్నీ జరిగిపోయినై.

ఎన్నికల ప్రచారాలు ప్రారంభమైనై. నెహ్రూ బొమ్మతో పోస్టర్లు వేసి, కాంగ్రెసు అభ్యర్థి "నెహ్రూకే మీ వోటు, నాకే మీ వోటు" అన్నాడు ఎన్నికల గుర్తులుగా సైకిలునీ, దీపాన్నీ యెన్నుకున్న ఇద్దరు అభ్యర్థులు, ఒకడు సైకిళ్ళ మందను లేవదీశాడు, మరొకడు పట్టపగలే దీపాలతో ఊరేగాడు. దుర్యోధనం ఒక లారీని ఎన్నికల గుర్తుగా ఎన్నుకోవటంలో కూడా, ఇటువంటి దూరపాలోచన బొత్తిగా చేయకపోలేదు.

నడి బజారులోనే "దుర్యోధనం ఎన్నికల ఆఫీసు" అంటూ టెంటువేశాడు. నావంటి అప్రయోజకుల్ని మరి కొంతమందిని చేరదీశాడు. వాళ్ళంతా నాకింద గులాముల్లే ఉంటారన్నాడు.

మా నియోజకవర్గంలో వోటర్ల జాబితా సంపాదించాం. మా కింద రెండు టాక్సీలు సిద్ధంగా ఉంచాడు దుర్యోధనం.

వాడు అచ్చువేయించిన పోస్టర్లకీ, కరపత్రాలకీ లెక్కా పద్దూ లేదు. నీళ్ళలాగా, ఇంత డబ్బు ఖర్చుచేయటం చూస్తే నాకుండబట్టలేదు.

"హటాత్తుగా ఇంత డబ్బు ఎక్కడ సంపాదించావు? ఈ డబ్బుతో నీకున్న అప్పులు తీర్చుకొని ఉంటే ఎంత లాభించేది?" అన్నాను చివరికి.

"నువ్వు నోరు ముయ్యి! నన్నేమీ ప్రశ్నించకు, ఈ వెధవడబ్బు పోతే దీనికి పదింతలు వచ్చి కాళ్ళమీద పడ్తుంది. అందుకే ఈపాట్లు. బంతిని, యెంత బలంగా నేలకేసి కొడితే, అంతమీదకి అది ఎగిరేటట్టు. ఎంత డబ్బు ఖర్చు చేస్తే అంత మళ్ళీ వస్తుంది. ఆర్థిక శాస్త్రంలో ఈ మూలసూత్రం, నువ్వు ఏనాడో పట్టుకోవలసింది!" అన్నాడు దుర్యోధనం మళ్ళీ కర్ర విరిచినట్టు.

ఎవడో వర్తకుడైన స్నేహితుణ్ణి- హీరాలాల్ నేమో!- పూర్తిగా తువరం చేశాడని మాత్రం నిర్ణయించుకున్నాను.

శాసన సభకు దుర్యోధనంతోపాటు పది మంది నిలబడ్డారు. ఇంకేదో నియోజకవర్గంలో అంతా చేరి పదిహేనుమంది నిలబడటం చూసి, నాకు నేనే ధైర్యం చెప్పుకున్నాను మావాడు గెలిచే అవకాశాలు అంతకన్నా యెక్కువే అనుకొని! వాడికి ఎలెక్షన్ ఏజంటుగా కుదిరాక, నేను కోరుకోగలిగేది, వాడి విజయం తప్ప ఇంకేముంటుంది?

దుర్యోధనంతోపాటు, శాసన సభకు కాంగ్రెసూ, కమ్యూనిస్టు, కె. యం. పి. కృషికార్ లోక్ పార్టీ, సోషలిస్టు, అయిదుగురు స్వతంత్రులూ నిలబడ్డారు. పార్లమెంటుకి కాంగ్రెసు, కె. యం. పి, కమ్యూనిస్టు, స్వతంత్రులు మొత్తం ఎనమండుగురు నిలబడ్డారు. శాసనసభకు స్వతంత్రంగా నిలబడ్తున్న వారిలో ఒకరు శాంతాదేవిగారు. ఆవిడ ఎలెక్షను ఆఫీసు, మా ఆఫీసుకి వంద గజాలలో ఉంది. శాంతాదేవిగారు ఆడపిల్లల బడిలో టీచరు. ఊళ్ళో ఉన్న మహిళా సంఘానికి కార్యదర్శిని. ఆడవాళ్ళంతా చేరి, చందాలు వేసుకొని, ఆవిడ కయ్యే ఖర్చు భరిస్తున్నారని తెలిసింది.

"శాంతాదేవి కేసు చాలా జెన్యుయిన్ గా ఉంది. నీవూ, నీతోపాటు మరి నలుగురూ విర

మించుకొని, ఆవిణ్ణి బలపరచటం న్యాయం" అంటూ సలహా యిచ్చాను దుర్యోధనానికి.

దుర్యోధనం మండిపడ్డాడు.

"ఏమిటూ జెన్యూయిన్ కేసు! ఆడదనా? స్త్రీజాతిని ఉద్ధరిస్తుందనా! డబ్బురా డబ్బు! ఆడదాని చేతిలో అధికారం పెడితే అయినట్టే. ఆవిడికి బుద్ధి లేకుంటే ప్రజలకేనా ఉండాలి, మాతాంతే" అన్నాడు.

ఎన్నికలు మరో రెండు రోజులకు ప్రారంభమవుతాయనగా, దుర్యోధనం టాక్సీలో ఆడావుడిగా వచ్చి, పెద్ద కట్టలు రెండు ముందు పెట్టాడు.

"ఈ స్లిప్స్, ఒక్కొక్కదానిమీద వోటరు పేరూ, వాడి సీరియల్ నంబరూ, వాడి బూతు నంబరూ- వెధవ పేరు ఏడిసినట్టుందిలే- అన్నీ రాయించి, ఇంటింటికీ పంచిపెట్టించు." అన్నాడు.

పంచేయడానికి పనిలేని కుర్రకారంతా వచ్చారు. ఇక నేం? సాయంకాలానికల్లా చాలా పని పూర్తిఅయింది.

మర్నాడుదయం, రెండు పెద్ద లారీలనిండా జనం వచ్చిపడ్డారు. దుర్యోధనం కారులో వచ్చాడు.

"ఎవరు వీళ్ళంతా?" అన్నాను ఆశ్చర్యపోతూ.

"మన వాళ్ళేగా మా హీరాలాలు మిల్లులో పనిచేస్తున్న జనం! వాళ్ళ చుట్టాలూనూ! తలా అయిదేసి రూపాయలు పారేస్తే, అరవటానికి సిద్ధపడతారు"అన్నాడు దుర్యోధనం.

వాళ్ళ కేకలు మిన్ను ముట్టేస్తున్నాయ్.

"వోట్ ఫర్ దుర్యోధనం"

"వోట్ ఫర్ దుర్యోధనం"

"దుర్యోధనం గారికీ జై"

"దుర్యోధనం గారికీ జై"

వీరంతా లారీలలో వొచ్చి, ఈ గావుకేకలు వేయటానికీ, మావాడి ఎన్నికల చిహ్నం లారీ కావటానికీ సరిపోయింది. గొంతులు చించేసుకుంటూ డబ్బు కిట్టించుకుంటున్నారు లారీలలో జనం.

సాయంకాలం దుర్యోధనం వచ్చాడు.

"రేపు మనం మకాం ఎత్తేయాలోయ్! ఈ దగ్గిర్లో ఒక బూతుంటుంది. దీని ముఖం ఈడ్చా- ఈ బూతుకి ఏదైనా తెనుగుపదం కూడా దొరకదు"అన్నాడు.

"ఎత్తేద్దాం."అన్నాను.

"అన్నీ సక్రమంగా ఉన్నట్టేనా? మనకు ఖచ్చితంగా ముప్ఫయివేల వోట్లు ఉన్నాయి. మొత్తం లక్ష వోట్లన్నా పడొచ్చు పార్లమెంటు సీటుకి. మెజారిటీ మనదేన్లే. మిగతావి అంతా పంచుకొని ఏడుస్తారు. ఎసెంబ్లీకి కనీసం ముప్ఫయివేల వోట్లు పడాలి. అందులో పదివేలు మనవే అనుకుందాం."

మా "అర్గనైజింగ్ ఎబిలిటీ"కి మేమే భుజాలు ఎగరేశాం.

"అంతా ఒక గంట క్రితం చిత్రం జరిగింది. శాంతాదేవి ఎక్కడనుంచో వస్తూండగా ఎవరో ఆవిణ్ణి కొట్టారు. పాపం, ముక్కుగిరిపోయింది. ఆస్పత్రికి తీసుకుపోయి కట్టు కట్టించారు" అన్నాడు దుర్యోధనం.

"ఏం? ఏమయిందీ?"అన్నాను ఆదుర్దాగా.

"ఆ, ఎవరో ఆవిణ్ణి విరమించుకో మన్నారుట. ఆవిడ ససేమిరా అన్నదట. ఆ తరవాత కథకీ, ఈ సంఘటనకీ ముడిపెడుతూన్నారు. కమ్యూనిస్టులే ఇటువంటి పనులు చేస్తున్నారంటూ అప్పుడే కాంగ్రెసు క్యాంపువాళ్లు అరుస్తున్నారు"అన్నాడు దుర్యోధనం.

"ఇదివరకే నీకు చెప్పానా కానా ఆవిణ్ణి సపోర్టు చేద్దామని? ఇంతవరకూ రాకపోను కదా?" అన్నాను జాలిగా.

"నీ సానుభూతి మండినట్టే ఉంది.ఇలాంటివి ఎన్నో వస్తాయి. ఎన్నికలంటే తమాషా అనుకున్నావా ఏం?" అన్నాడు దుర్యోధనం.

"నీ వింత డబ్బు..." అనబోయినాను.

"నీ డబ్బు మండిపోనూ. ఆ మాట ఎత్తకు. పోతేపోయింది వెధవ డబ్బు. మనం తీసుకుపోతామా ఏమిటి? ఎట్లా వచ్చిందీ ఆట్లానే పోతుంది" అన్నాడు.

"ఆది కాదు. ఇంత డబ్బు ఖర్చు చేశాం గానీ, చివరికి కమ్యూనిస్టులే వచ్చేటట్టు కనిపిస్తోంది. నువు లారీలలో యెక్కించుకొచ్చిన

వారంతా కమ్యూనిస్టుకి వోటు చెయ్యబోతున్నారు"

"నేను వాళ్ళ చేత ఏదో అరిపించటానికి తెచ్చాను గాని, వాళ్ళ వోట్లు కొనలేదే?" అన్నాడు దుర్యోధనం.

"కమ్యూనిస్టులు కొనుక్కొన్నారనా నీ తాత్పర్యం?"

"వాళ్లు కొనుక్కోనవసరం లేకుండానే పడవలసినవన్నీ వాళ్లకు పడతై. నేను తక్కిన వాళ్ళగురించి మాట్లాడుతున్నాను."

వోటు కొన్నా, వొచ్చేదికాదన్న విషయం దుర్యోధనానికి తెలిసే ఉండాలి మరి.

వోటింగు ప్రశాంతంగానే సాగిందని చెప్పాలి. ఉదయంనుంచీ కార్మికజనం క్యూలలో నిలబడ్డారు. వాళ్ళంతా కమ్యూనిస్టులకే వోటు చేసివుంటారని సులభంగానే ఊహించవచ్చును. ఎలెక్షన్ల ఏజెంటుగా నేనుముఖ్యమైన బూతులో నలుగురితోపాటు ఆదుర్దగానే ఉన్నాను.

సాయంకాలం చేతులు దులిపేసుకొని బయటపడ్డాం.

"వోట్ల పెట్టెలకి అంతా కాపలా కాస్తారుట!"

"చాల్లే. మనం అనుకొన్నది సాధించాక ఇంకా వోట్ల పెట్టెలెందుకూ? కమ్యూనిస్టు ఏజెంట్లు కొస్తున్నారు అన్ని చోట్ల" అన్నాడు వాడు.

వారం రోజులలో ఫలితాలు తెలిశాయి. దుర్యోధనానికి పార్లమెంటు సీటు వ్యవహారంలో డిపాజిట్లు దక్కడం పెద్ద విశేషం! ఎటొచ్చీ ఎసెంబ్లీ డిపాజిట్టు పోయిందని వేరే చెప్పాలా?

ఈమాత్రానికి వాడు ఎందుకు నిలబడ్డాడో, ఏ ఆధారంతో నిలబడి ఇంత డబ్బు- బాగా పాతికవేల రూపాయలు ఖర్చుచేశాడో, తనే కాక నన్నెందుకీ రచ్చలో కీడ్చాడో నాకర్థం కాలేదు. నా వోట్లు వ్యర్థం అయిపోయినాయి కదా అనే నా విచారం!

"నేచెప్తాను విను. నా సేటుగాళ్లు అందరికీ, తమ తరఫున, పార్లమెంటులోనో, కనీసం, శాసన సభలోనో, ఒకడుండడం అవసరమనిపించింది. వాళ్ళపాలిటికి నా కన్న ఘనుడెవడు? వాళ్ళందరికీ ఆదాయపు పన్ను తప్పించాను కాదూ! కొన్ని లక్షలుంటాయి. ఇంకా చాలా డబ్బు దాచుకోవడంలో ఎంతో సహాయ పడ్డాను. కృతజ్ఞతకొద్దీ, వాళ్లు తలా వాటాలు వేసుకొని యాభైవేలు చేశారు. వాళ్లు పన్ను కింద చెల్లించే డబ్బులో ఇది కానీకి సమానం. ఈ డబ్బుతో నా దురద తీర్చుకోమన్నారు. గెలిచానా, వాళ్ళని ఉద్ధరించానన్న మాట. గెలుస్తాననే ఆశతో నేను నిలబడనే లేదు! మనం, ఏదో పని చేస్తున్నట్టు కనపడాలి గనక. ఆ విషయం నీతో ముందుగా చెప్పలేదు. చెప్తే చెయ్యవు. మనవాళ్ళంతా కమ్యూనిస్టులవైపు బాగా మొగ్గిఉన్నారని తెలిసి కూడా నేను గెలుస్తాననుకోవటం మూర్ఖం కాదూ? కాని, డబ్బురా! డబ్బు! ఈ వెధవలకు తెలివి లేదు! డబ్బుతో పులుపెక్కిన వారంతా ఇంతే. ఇప్పుడేమయిందీ? వాళ్ళిచ్చిన యాభైవేల రూపాయిలూ ఖర్చుకింద జమకట్టాను. మనకు ధారాళంగా పాతికవేలు మిగిలింది. నేను సొంతానికి దమ్మిడీ కూడా తీసుకోలేదని నచ్చచెప్పటానికీ, ఆ డిపాజిట్టేదో రాగానే, వాళ్లకు ఇచ్చేస్తానని మాట ఇచ్చాను! చెప్పు. ఇప్పుడిందులో నీకేపాటి వాటా కావాలి?" అన్నాడు దుర్యోధనం.

---

ఉన్న పార్టీలు అయిదు అయితే, అందులో నాలుగింటితో చేరి మిగిలిన పార్టీని అందరికీ శత్రువును చెయ్యండి. ఈ శత్రువు రూపుమాసిపోయాక, మూడు పార్టీలతో చేరి నాలుగో పార్టీని బయటకు గెంటండి. ఇదే ప్రకారం చేస్తే ఆఖరికి మీకు ఎదుర్కోవడానికి ఒక్క పార్టీ మాత్రమే మిగులుతుంది. ఆ ఒక్క పార్టీనీ మీరు కబళించివేయలేకపోతే, మీకు ప్రయోజకత్వం లేదన్నమాట.— లెనిన్.